సాక్షి
చిత్తూరు
ఆదివారం । 20 । అక్టోబర్ । 2024



సరిహద్దుల్లో మద్యం జాతర
ఆంధ్ర -తమిళనాడు సరిహద్దుల్లో మద్యం దుకాణాలు కుప్పలు కుప్పలుగా వెలుస్తున్నాయి. - 8లో



తుపాను దెబ్బకు నేలకొరిగిన వరి
తుపాను ప్రభావంతో కురిసిన వర్షాల దెబ్బకు చేతికొచ్చిన వరి పంట నేలకొరగడంతో రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. - 8లో



అండర్-17 కబడ్డీ జట్ల ఎంపిక
అండర్ - 17 కేటగిరిలో జిల్లా కబడ్డీ బాలుర, బాలికల జట్లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. - 8లో



కార్వేటినగరం బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న వంట నిర్వాహకులు

పేరుకే మెనూ.. పెట్టిందే తిను!

జిల్లా వ్యాప్తంగా 2,444 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. ఇందులో ఒకటి నుంచి పదో తరగతి వరకు 1,44,500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ నెల 19వ తేదీ శనివారం జిల్లాలో సాక్షి నిర్వహించిన పరిశీలనలో మధ్యాహ్న భోజన నాణ్యత లోపం కారణంగా 39,877 మంది విద్యార్థులు అన్నం తినలేదు. ఇందుకు నాణ్యమైన భోజనం లేకపోవడం, గడ్డకట్టిన ఉడకని అన్నం, నీళ్ల సాంబారు, చాలా వరకు పాఠశాలల్లో మెనూ అమలు చేయకపోవడం వల్ల విద్యార్థులు మధ్యాహ్నభోజనానికి దూరమయ్యారని తెలిసింది. గతంలో మధ్యాహ్న భోజనం నాణ్యతను విద్యాశాఖ అధికారులు తనిఖీ చేసి ప్రత్యేక యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేసేవారు. అయితే నాలుగు నెలలుగా అలాంటి పరిస్థితులు, పర్యవేక్షణలు లేవు. దీంతో పేద విద్యార్థుల ఆకలితో అలమటిస్తున్నారు.

- ఆకలితో అలమటిస్తున్న విద్యార్థులు
- సర్కారు బడుల్లో అమలు కాని మెనూ
- జిల్లాలో 39,877 మంది మధ్యాహ్న భోజనానికి దూరం
- వంట కార్మికులను తొలగించిన కూటమి సర్కారు
- సాక్షి పరిశీలనలో వెలుగులోకి వాస్తవాలు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద బిడ్డల కడుపుపై కొట్టింది. నాణ్యమైన మెనూకు మంగళం పలికింది. బడిలో ఒక పూట నాణ్యమైన భోజనం తింటున్న విద్యార్థులు ఇప్పుడు ఆకలితో అల్లాడిపోతున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి సక్రమంగా నిధులు ఇవ్వడం మానేసి కార్మికులను తీసేయడమే అజెండాగా పెట్టుకుంది. పాఠశాలలకు నాణ్యత లేని బియ్యం సరఫరా చేస్తోంది. కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యంపై పెట్టిన దృష్టి నాణ్యమైన విద్య, భోజనంపై పెట్టలేదు. తల్లికి వందనం పేరుతో తల్లులను దగాచేసిన ప్రభుత్వం చిన్నారుల కడుపు మాడుస్తోంది. పాఠశాల భవన నిర్మాణాలు ఆగిపోయాయి. ఇక మరుగుదొడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. జిల్లాలోని 32 మండలాల్లోని ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల అవస్థలు పడుతున్నారు.

పాఠశాలలపై సర్కారు చిన్నచూపు
జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 1,44,500 మంది ప్రస్తుతం చదువుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దింది. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు రోజుకో ప్రత్యేక మెనూను అమల్లోకి తీసుకొచ్చింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం స్కూళ్లను గాలికొదిలేసింది. నాడు-నేడు పనులను ఆపేయడంతో పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజనంలో పాటించాల్సిన మెనూ అమలు చేయకపోవడంతో వేలాది మంది విద్యార్థులు ఇళ్ల నుంచి భోజనాలను తెచ్చుకుంటున్నారు.

జిల్లా సమాచారం

యాజమాన్యం	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	1,908	65,576
ప్రాథమికోన్నత	206	46,796
ఉన్నత	330	32,128
మొత్తం	2,444	1,44,500

కాలం చెల్లిన చిక్కీలు
గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సోమవారం నుంచి శనివారం వరకు రోజుకో మెనూను అమలు చేసింది. ఇందులో వారానికి ఐదు కోడిగుడ్లు, వారానికి మూడు సార్లు చిక్కీలు, రాగి జావ ఇవ్వాలని మెనూలో పెట్టింది. అయితే తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు దిశగా మధ్యాహ్నభోజన పథకానికి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంగా పేరు మార్చి చేతులు దులిపేసుకుంది. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల కాలం చెల్లిన (గడువు ముగిసిన)చిక్కీలను విద్యార్థులకు అందించారు. ఈ విషయాన్ని గమనించి ఆ పాఠశాలలోని టీచర్ వాటిని మరుసటి రోజు నుంచి సరఫరా చేయించకుండా ఆపేశారు. కుప్పం, జీడీ నెల్లూరు, పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో గుడ్లు నాసిరకంగా వస్తున్నాయి. కొన్ని చోట్ల మురిగిన గుడ్లు కూడా వస్తుండటంతో వాటిని తినలేక పారేస్తున్నారు. మరి కొన్ని చోట్ల గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌లు మరమ్మతులకు గురయ్యాయి.



పీసీఆర్ హైస్కూల్లో నిరుపయోగంగా వాటర్ ప్లాంట్



భోజనం ఎక్కడో వండి ఆటోలో చిత్తూరు ప్రభుత్వ పాఠశాలకు తీసుకొచ్చిన కార్మికులు

9 నెలలుగా అందని జీతాలు

జిల్లాలో సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహించే కుప్పం నియోజకవర్గంలో అక్షయపాత్ర ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అందిస్తున్నారు. ప్రభుత్వం ఆ ట్రస్టు నిర్వాహకులకు నిధులను మంజూరు చేస్తుంది. ట్రస్టు నిర్వాహకులు కార్మికులకు జీతాలు ఇవ్వాలి. ఆ నియోజకవర్గంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు తొమ్మిది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడంతో అక్కడి కార్మికులు అష్టకష్టాలు పడుతున్నారు. ఫలితంగా అక్షయపాత్ర ట్రస్టుకు సైతం నిధులు ఇవ్వలేదు. నిధులు రాకపోవడం వల్ల అక్షయపాత్ర ట్రస్టు నిర్వాహకులు చేతి నుంచి డబ్బులు ఖర్చు చేయలేక సర్కారు పాఠశాలల విద్యార్థులకు నాసిరకంగా మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. సీఎం ఇలాకాలోనే పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన చోట్ల ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.



శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు పీసీఆర్ పాఠశాలలో నిద్రిస్తున్న ఉపాధ్యాయిని

కార్మికుల తొలగింపు
జిల్లాలో మొత్తం 4,603 స్వయం సంఘాల ఆధ్వర్యంలో మధ్యాహ్నభోజనం నిర్వహిస్తున్నారు. వంట కార్మికులు, సహాయకులను కలుపుకొని 4,238 మంది పనులు చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు (ఆయాలు) 2,557 మంది ఉన్నారు. వాచ్‌మన్లు 296 మంది ఉన్నారు. వీరికి జూలై నుంచి జీతాలు ఇవ్వడం లేదు. సుదీర్ఘకాలంగా 20 ఏళ్లకు పైబడి పనిచేస్తున్న వారు ఉన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులందరికీ కష్టాలు మొదలయ్యాయి. వంట కార్మికులను బలవంతంగా తొలగించి కొత్తవారిని తీసుకున్నారు. వారు నాణ్యత లేకుండా వండి పెడుతున్నారు. అధికార పార్టీకి చెందిన వారు కావడంతో ఉపాధ్యాయులు వారిని ప్రశ్నించే సాహసం చేయలేక పోతున్నారు. జిల్లాలో 4,603 మంది మధ్యాహ్న కార్మికులున్నారు. వీరిలో దాదాపు 1,250 మందికి పైగా కార్మికులను తొలగించారు.

నీళ్ల సాంబారు



నేను తొమ్మిదవ తరగతిలో ఉన్నప్పుడు మా పాఠశాలలో మధ్యాహ్నభోజనం బాగా పెట్టేవారు. ఇప్పుడెందుకో సరిగ్గా పెట్టడం లేదు. అన్నం గడ్డగడ్డలుగా, సాంబారు నీళ్ల నీళ్లగా ఉంటోంది. చిక్కీ రుచిగా ఉండడం లేదు. నేను ముందు తినే విధంగా ఇప్పుడు మా పాఠశాలలో అన్నం తినడం లేదు. సార్ వాళ్లకు చెబుదామంటే భయంగా ఉంది.
– యోగేశ్వర్, ఆముదాల, పాలసముద్రం

కార్మికులను తొలగించడం అన్యాయం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మధ్యాహ్నభోజన కార్మికులను తొలగించడమే పనిగా పెట్టుకుంది. పొట్టకూటి కోసం పనిచేసే కార్మికులపైన కూటమి సర్కారు తన ప్రతాపం చూపడం సరైన పద్ధతి కాదు. స్వచ్ఛందంగా తప్పుకోవాలని హెచ్‌ఎంలు కార్మికులపై ఒత్తిడి తెచ్చి రాజీనామా చేయిస్తున్నారు.
– నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి, చిత్తూరు

పోరాట యోధుడు భూమన

- ప్రజలు, కార్యకర్తల సంక్షేమం కోసం ఎందాకైనా!
- విద్యార్థి దశ నుంచే పోరాటాలు చేసిన నాయకుడిగా గుర్తింపు
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడిగా భూమన నియామకం
- అధికార పార్టీలో గుబులు



సాక్షి ప్రతినిధి, తిరుపతి: పోరాట యోధుడుగా భూమన కరుణాకరరెడ్డికి పేరుంది. అధికారపక్షం తప్పులను ఎత్తిచూపుతూ.. ఇటు ప్రజలు.. అటు పార్టీ కార్యకర్తలకు అండగా నిలబడుతారనే గుర్తింపు ఉంది. ఈ క్రమంలోనే ఆయన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిలో పడ్డారు. భూమన కరుణాకరరెడ్డిని చిత్తూరు, తిరుపతి జిల్లాల (తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు) అధ్యక్షుడిగా నియమించారు. భూమన నియామకం పట్ల వైఎస్సార్‌సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికాపక్షంలో భూమన నియామకంపై తీవ్ర చర్చ జరుగుతోంది. విద్యార్థి దశ నుంచే పోరాటాల్లో రాటుదేలిన వ్యక్తిగా గుర్తింపు పొందడాన్ని గుర్తుచేసుకుంటున్నారు. ప్రజలు.. పార్టీ కార్యకర్తల పక్షాన పోరాటం చేసే విషయంలో వెనుకాడే వ్యక్తి కాదని చర్చించుకుంటున్నారు. విద్యార్థి దశలో.. ఆర్ట్ కళాశాల చైర్మన్‌గా ఉన్న సమయంలో అశ్లీల చిత్రాల ప్రదర్శన, పోస్టర్లు అంటించడంపై భూమన కరుణాకరరెడ్డి ఉద్యమించారు. ఎమర్జెన్సీ సమయంలో అరెస్ట్ అయిన వారిలో అతిచిన్న వయస్కులు భూమన కరుణాకర రెడ్డి. ఆ సమయంలో అరెస్టయ్యి 21 నెలల పాటు జైల్లో గడిపారు. ఆ సమయంలో ఎన్నో అనుభవాలు.. పలువురు మేధావులతో పరిచయాలు.. ప్రజాశ్రేయస్సు కోసం మరింతగా పోరాటం చేసేలా ప్రభావితం చేశాయని ఆయన సన్నిహితులు చెబుతుంటారు. ఆ తరువాత జనప్రవంతిలోకి వచ్చాక దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డితో అనుబంధం నాయకుడిగా ఎదగడానికి ఎంతగానో ఉపయోగపడిందని పలు సందర్భాల్లో ఆయన వెల్లడించారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం పోరాటం చేసిన నాయకుల్లో భూమన కరుణాకరరెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది.

రాజకీయాల్లోకి వచ్చాక..
యాభై ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న భూమన కరుణాకరరెడ్డి కాంగ్రెస్ పార్టీలో పీసీసీ సెక్రటరీగా నియమితులయ్యారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వ్యక్తి గత కార్యదర్శిగా మన్ననలు పొందారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తుడా చైర్మన్, టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి ఎన్నో చారిత్రాత్మకమైన, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తనేంటో నిరూపించుకున్నారు. 2012, 2019లో తిరుపతి శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో గవర్నింగ్ బాడీ, పబ్లిక్ అకౌంట్ కమిటీ సభ్యునిగా పనిచేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో 2023లో టీటీడీ చైర్మన్‌గా మరోమారు బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కారదర్శగా నియమితులయ్యారు. తాజాగా చిత్తూరు, తిరుపతి జిల్లాల (తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు) అధ్యక్షులుగా నియమించడంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాజనాలబండ మహిమతోనే నగలు లభ్యం



నగలు, నగదును అందుకుంటున్న బాధితుడు అజయ్‌కుమార్ దంపతులు



చోరీకి గురై తిరిగి లభ్యమైన బంగారు నగలు

చౌడేపల్లి: సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ ప్రసన్న ఆంజనేయస్వామి మహిమతోనే చోరీకి గురైన బంగారు నగలు, నగదు తిరిగి లభ్యమయ్యాయని బాధితుడు సి.అజయ్ బాబు తెలిపారు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రాజనాలబండకు చేరుకుని బంగారు నగలు, నగదును స్వామివారి పాదాలచెంత పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం చెరుకువారిపల్లెకు చెందిన సి.అజయ్‌బాబు ఇంట్లో మూడు నెలల క్రితం 62 గ్రాముల నగలు, రూ.25 వేల నగదు చోరీ జరిగింది. అజయ్‌బాబు ఇంట్లో వారిని, చుట్టుపక్కల వారిని విచారించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. పెద్ద మనుషులతో పంచాయతీ నిర్వహించి రాజనాల బండలో ప్రమాణం చేయాలని తీర్మానించారు. గత శనివారం రాజనాలబండకు చేరుకుని ముందుగానే ఈ నెల 19వ తేదీ శనివారం ప్రమాణం చేయడానికి కావాల్సిన ఏర్పాట్లు పూర్తిచేసి వారి గ్రామానికి వెళ్లి విషయాన్ని గ్రామపెద్దలకు వివరించారు. శనివారం ఉదయం ఇంటికొక మనిషి రాజనాల బండకు బయలు దేరాల్సి ఉండగా ఇంటి ఆవరణలో నగలు, నగదు ప్రత్యక్షమయ్యాయి. వాటిని గుర్తించిన బాధితులు విషయాన్ని పెద్ద మనుషులకు తెలిపి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకుని పూజలు చేశారు. స్వామి మహిమతోనే పోయిన నగలు తిరిగి వచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

అదుపుతప్పిన కంటైనర్ లారీ



కంటైనర్‌ను క్రేన్‌తో లాగుతున్న దృశ్యం

గంగవరం: బెంగళూరు వైపు వెళ్తున్న కంటైనర్ లారీ అదుపు తప్పింది. డివైడర్‌పైకి వెళ్లి రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. గంగవరం బైపాస్‌లోని వైఎస్సార్ జంక్షన్ వద్ద శనివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు బెంగళూరు వైపు వెళ్తున్న కంటైనర్ గంగవరం బైపాస్ రోడ్డు వైఎస్సార్ జంక్షన్ వద్ద అదుపుతప్పింది. స్పీడ్ బ్రేకర్స్‌ను కంటైనర్ వేగంగా దాటడంతో లారీ ముందు భాగం డివైడర్‌పైకి దూసుకెళ్లి రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో కాసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వెంటనే పోలీసులు స్పందించి క్రేన్ సాయంతో లారీని వెనక్కు లాగి పంపేశారు. అయితే అదృష్టవశాత్తు ఎలాంటి నష్టమూ జరగలేదు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



పట్టాలపై మృతి చెందిన తేజేశ్వర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానిక మెసానిక్ మైదానం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతిలోని ఓ మెడికల్ కంపెనీ ప్రతినిధిగా పనిచేస్తున్న తేజేశ్వర్‌రెడ్డి (35) ప్రయాణిస్తున్న రైలు కింద పడినట్లు గుర్తించామన్నారు. అందుకు గల కారణాలు తెలియవన్నారు. సమాచారాన్ని మృతుడి కుటుంబసభ్యులకు అందించినట్లు వివరించారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

విధుల్లో ఉండాల్సిందే!

సాక్షి ఎఫెక్ట్..

కాణిపాకం: వైద్యులు, సిబ్బంది విధిగా విధుల్లో ఉండాల్సిందేనని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి ఆదేశించారు. జిల్లాలో పడకేసిన పల్లె వైద్యం అనే శీర్షికన శనివారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ఒక డాక్టర్ ఫ్యామిలీ ఫిజిషియన్‌కు, మరో డాక్టర్ పీహెచ్‌సీలో ఉండాలని చెప్పారు. సొంత పనులకు వెళితే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది సీజనల్ వ్యాధుల కట్టడికి కృషి చేయాలన్నారు. యాదమరి పీహెచ్‌సీ వైద్యురాలు విధులకు హాజరై, అనారోగ్య కారణాల వల్ల ఇంటికి వెళ్లినట్లు జిల్లా అధికారికి వివరణ ఇచ్చుకున్నారు. మళ్లీ రెండు గంటల వ్యవధిలో డ్యూటీకి వచ్చినట్లు అందులో పేర్కొన్నారు.

సరిహద్దుల్లో మద్యం జాతర

ప్రస్తుత ప్రభుత్వంలో రాష్ట్ర సరిహద్దు అంటే అది మద్యం వ్యాపార కేంద్రం అనే చందాన తయారైంది. ప్రశాంతంగా ఉన్న సరిహద్దు ప్రాంతాల్లో మద్యం అలజడి మొదలైంది. లాటరీలో షాపులు దక్కించుకున్న వారం దరూ సరిహద్దుల వైపునకే పరుగులు తీస్తున్నారు. ఒకప్పుడు మినీ పాండిచ్చేరి అనే పేరు పొందిన రాష్ట్ర సరిహద్దు కనకమ్మసత్రం మళ్లీ ఆ దిశగా అడుగులు వేస్తోంది. షాపులు సరిహద్దులకు వెళ్లడంతో బెల్టు షాపులు గ్రామాలవైపు పరుగులు తీస్తున్నాయి. డిమాండ్ పెరిగిన బెల్టు షాపులకు ఎమ్మెల్యేలు, షాడో ఎమ్మెల్యేల సిఫారసులు పెరుగుతున్నాయి. ఎమ్మార్పీ పేరుకు మాత్రమేనని, ఇష్టానుసారంగా ధరలు పెంచుకోవచ్చన్న మౌఖిక ఆదేశాలు దుకాణదారులకు వెళ్లాయి.

- తమిళ తంబీలే ఆదాయ వనరు
- మినీ పాండిచ్చేరిగా కనకమ్మసత్రం
- ఊళ్లలో బెల్ట్ షాపుల కోసం ఎమ్మెల్యేల సిఫారసులు
- బెల్టు షాపులకు రూ.5 లక్షల వరకు డిమాండ్
- తొలి రోజు నుంచే ఎమ్మార్పీ ఉల్లంఘన



తమిళనాడు సరిహద్దు కనకమ్మ సత్రం వద్ద ఏర్పాటుచేసి మద్యం షాపులు



బలిజ కండ్రిగ వద్ద ఏర్పాటుచేసిన మద్యం షాపు

విజయపురం/నగరి: ప్రైవేటు దుకాణాల ఎంపిక లాటరీ పద్ధతి ముగియడంతో సరిహద్దు ప్రాంతాల్లో మద్యం జాతర మొదలైంది. కొత్త మద్యం పాలసీ ద్వారా చిత్తూరు జిల్లాలో 104 షాపులు, తిరుపతి జిల్లాలో 227 షాపులు ఏర్పాటు చేస్తున్నారు. ఇవి దక్కించుకున్న వారు ఎక్కువగా తమిళనాడు సరిహద్దులో దుకాణాలు పెట్టడానికే మొగ్గు చూపుతున్నారు. 20వేల జనాభా కూడా లేని విజయపురం మండలంలో నాలుగు షాపులు ప్రభుత్వం కేటాయించడం అందులో మూడు సరిహద్దులోనే ఏర్పాటు చేయడం గమనార్హం. సూళ్లూరుపేట నియోజకర్గంలో తమిళనాడు సరిహద్దును ఆనుకొని ఉన్న పన్నంగాడు, సున్నాంబు కొలం ప్రాంతాల్లోను, సత్యవేడు నియోజకవర్గంలో దాసుకుప్పం, సురుటుపల్లి, రోసానూరు ప్రాంతాల్లోను, చిత్తూరు నియోజకవర్గం గుడిపాల వద్ద, గంగాధర నెల్లూరు నియోజకవర్గం కొల్లాగుంట, బలిజ కండ్రిగలోను పోటీలు పడి షాపులు ఏర్పాటుచేయడం, ఆ షాపులకే దరఖాస్తులు కూడా ఎక్కువగా రావడం చూస్తే సరిహద్దులో షాపులకు ఎంత డిమాండ్ ఉందో తెలియజేస్తోంది. బలిజకండ్రిగ దుకాణానికి మాత్రమే 84 దరఖాస్తులు వచ్చాయి. తమిళనాడుకు చెందిన ఒక వ్యాపారి విజయపురం దుకాణానికి ఏకంగా 30 దరఖాస్తులు వేయడం గమనార్హం. లాటరీ పద్ధతిలో షాపులు దక్కించుకునేందుకు దరఖాస్తులు ఎక్కువగా వేసి, లైసెన్సుల కింద రూ.55 నుంచి రూ.65 లక్షల వరకు చెల్లించేశారు. దీంతో సరిహద్దుల్లో అయితే రెండు రాష్ట్రాల వారు విచ్చేస్తారు. వ్యాపారం ఎక్కువగా జరుగుతుంది ఇతర ప్రాంతాల్లో బెల్టుషాపులు ఏర్పాటు చేసే వీలుంటుంది. దీంతో సరిహద్దు ప్రాంతాలు మద్యం విక్రయాలకు అనువుగా మారిపోయాయి.

తొలి రోజే ఎమ్మార్పీ ఉల్లంఘన

లక్షల రూపాయలు వెచ్చించి మద్యం షాపులను దక్కించుకున్న వ్యాపారులు ఎంత వెనుకేసుకుంటే అంత మంచిదనే భావనతో తొలి రోజు నుంచే నిబంధనల ఉల్లంఘనకు తెరలేపారు. బాటిల్‌పై ఉన్న ధర కంటే అదనంగా రూ.15 నుంచి 20 వరకు వసూలు చేస్తున్నారు. దీనికి అధికార పార్టీ నుంచి ఆదేశాలు ఉండడంతో అధికారులు కూడా పట్టించుకోవడం లేదు.

ఈ కారణంగా తమిళనాడుకు చెందిన వ్యాపారులు సరిహద్దు దుకాణాలకు ఎక్కువగా దరఖాస్తులు వేసి పలు షాపులను దక్కించుకున్నారు. సరిహద్దుల్లో వరుస కట్టి దుకాణాలు ఏర్పడడంతో తొలి రోజు నుంచే మందుబాబులు బారులు తీరుతున్నారు. దీంతో అక్కడ జాతర నెలకొంది.

మినీ పాండిచ్చేరిగా కనకమ్మసత్రం

తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన గ్రామం కనకమ్మ సత్రం మినీ పాండిచ్చేరిగా పేరొందింది. గతంలో వరుసగా ఏడెనిమిది మద్యం షాపులు ఉండేవి. మందుబాబులతో నిత్యం అక్కడ అలజడి నెలకొనేది. నగరి నుంచి చెన్నైకి వెళ్లే మందుబాబులు కనకమ్మసత్రం మార్గంలోనే వెళ్లేవారు. అక్కడ తాగడంతో వారి మధ్య గొడవలు చోటుచేసుకునేవి. దీంతో ఈ ప్రాంతాన్ని మినీ పాండిచ్చేరి అని పిలిచేవారు. గత ప్రభుత్వం అలాంటి పరిస్థితి లేకుండా చేసింది. ప్రశాంత వాతావరణాన్ని కల్పించింది. ప్రస్తుత ప్రభుత్వం షాపులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేయడంతో మళ్లీ మినీ పాండిచ్చేరి కళకళలాడుతోంది. ఆంధ్ర సరకు కావాలా .. తమిళనాడు సరకు కావాలా ... అన్నీ ఉన్నాయంటూ రాత్రి, పగలు తేడా లేకుండా మన రాష్ట్రానికి చెందినవారితో పాటు తమిళ తంబీలు మద్యం షాపుల వద్ద క్యూకడుతున్నారు.

బెల్ట్ షాపుల కోసం సిఫారసులు

కొన్ని మండలాలకు ఇచ్చిన షాపులు సరిహద్దుకు వెళ్లిపోవడం, కొన్ని మండాలాల్లో షాపులు కేటాయించపోవడంతో బెల్టు షాపులు పెట్టుకునేందుకు ఎక్కువ ఆస్కారం ఉంది. దీంతో లాటరీలో షాపులు దక్కని స్థానిక కూటమి నేతల కన్ను బెల్టుషాపులపై పడింది. ఈ కారణంగా బెల్టు షాపులకు డిమాండ్ పెరిగింది. స్థానిక ఎమ్మెల్యేలు ఆ పార్టీ నేతలను సంతృప్తి పరిచేందుకు బెల్టు షాపులు కేటాయించేందుకు సిద్ధమయ్యారు. ఆ దిశగా పావులు కదుపుతున్నారు. లాటరీలో షాపు దక్కించుకున్న వారు ఎవరైనా సరే బెల్టు షాపులు మాత్రం కూటమి నేతలకే ఇవ్వాలని హుకుం జారీచేస్తున్నారు. పంచాయతీ స్థాయి నాయకులు బెల్టు షాపుల కోసం ఎమ్మెల్యేలు, షాడో ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో ఒక్కో బెల్టు షాపునకు ఏడాదికి రూ.5 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కొన్ని చోట్ల బెల్టు షాపులకు కూడా వేలంపాట నిర్వహిస్తున్నట్లు బహిరంగ చర్చ జరుగుతోంది.

బెల్టు షాపులు పెట్టనివ్వకూడదు



ప్రజలు మత్తులో ఉంటే పథకాల గురించి ఆలోచించరని ప్రభుత్వం మద్యం పాలసీకి శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం కేటాయించిన షాపులు మినహా అదనంగా బెల్టుషాపులు పెట్టనివ్వకూడదు. నగరి మండలంలో అధికారికంగా షాపులు కేటాయించలేదు. మండల ప్రాంతంలో బెల్టుషాపులు ఎక్కడా పెట్టరాదు. అధికారులు ఈ విషయంలో తరచూ తనిఖీలు చేపట్టాలి. – ప్రకాష్, ముడిపల్లె, నగరి మండలం.

అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలి



మండలానికి నాలుగు దుకాణాలు కేటాయిస్తే వాటిలో 3 షాపులు సరిహద్దులోనే పెట్టారు. గతంలో ఇలాగే కనకమ్మ సత్రంలో ఎక్కువ షాపులు ఉండేవి. మినీ పాండిచ్చేరి అనే పేరుకూడా వచ్చింది. పలుమార్లు గొడవలు జరిగేవి. మళ్లీ ఆ పరిస్థితి వచ్చింది. గ్రామాల్లో బెల్టు షాపులు పెట్టేందుకు ఆస్కారం ఉంది. అలా జరిగితే పలు సమస్యలు తలెత్తుతుంది. – కన్నన్, విజయపురం.

నిబంధనలు తప్పకుండా పాటించాలి



మద్యం షాపులు పెట్టడానికి ప్రభుత్వం ఇచ్చిన నిబంధనలు తప్పకుండా పాటించాలి. అలా పాటిస్తున్నారా లేదా అనే అంశాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలి. నిబంధనలకు విరుద్ధంగా షాపులు ఏర్పాటుచేస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు. గంజాయి, మద్యం లాంటివి పల్లెలవరకు వచ్చేస్తుంటే యువత పెడదారి పట్టక తప్పదు. – రాజయ్య, పుత్తూరు.

స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాస్కెట్‌బాల్ క్రీడాకారులు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల పీడీ బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో శనివారం స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా ఆసక్తి ని పెంచేందుకు స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అండర్ 14, అండర్ 17 బాల, బాలికల బాస్కెట్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించినట్లు చెప్పారు. అండర్ 17 క్రీడాకారులు ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అండర్ 14 క్రీడాకారులు నర్సారావుపేటలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ సంఘ నాయకులు లక్ష్మీపతి, కృష్ణమూర్తి, విశ్రాంత పీడీ కుమార్, పీడీలు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో శ్రీరామ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కాలేజ్‌లో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఎంఎన్‌సీ ప్రతినిధులు కళాశాల విద్యార్థులను ఇంటర్వ్యూ చేసి, వార్షిక వేతనం రూ.4 లక్షలతో ముగ్గురు ఉద్యోగాలకు ఎంపికయ్యారని వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జయచంద్ర, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ టి విష్ణు వర్ధన్ రెడ్డి, కంపెనీ ప్రతినిధి శ్రీకాంత్ అభినందించారు.

తుపాను దెబ్బకు నేలకొరిగిన వరి



పుణ్యసముద్రం వద్ద తుపాను ప్రభావంతో నేలమట్టమైన వరిపంట

తవణంపల్లె: తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు వరి పంట నేలకొరిగింది. ప్రకృతి వైపరీత్యం వల్ల చేతికి వచ్చిన పంట నేలమట్టమైంది. తడిచిన ధాన్యం మొలకలు రావడంతో రైతులకు కంటతడి మిగిలింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఒబ్బిడి చేసుకొనే సమయంలో తుపాను వచ్చి నట్టేట ముంచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుపాను తాకిడికి మొలకలు వచ్చి నష్టపోయిన పంటకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలో పుణ్యసముద్రం, పల్లెచెరువులో కోతకు వచ్చిన వరి పంట సుమారు 5 ఎకరాలకుపైగా నేలమట్టమైనది. మండల వ్యవసాయాధికారి జి. ప్రవీణ్ వరి పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నష్టపరిహారం కోసం జిల్లా అధికారులకు నివేదిక పంపుతానని రైతులకు భరోసా ఇచ్చారు.

అండర్–17 జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక



బాలికల జిల్లా జట్టుతో ఉపాధ్యాయుల బృందం

చౌడేపల్లె: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -17 బాలుర బాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను స్థానిక ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో శనివారం నిర్వహించారు. క్రీడలను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంతవాణి, కార్యక్రమ నిర్వాహకులు చుక్కావారిపల్లెకు చెందిన నవీన్ బాబు, హెచ్‌ఎం నాగరాజ రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ సుధాకర్ కలిసి ప్రారంభించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 నియోజకవర్గాల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు ఈ నెల 27నుంచి రాయచోటిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో తలపడనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ నెల 23 నుంచి 26 వరకు చౌడేపల్లె ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రత్యేక కోచింగ్ అనంతరం రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మాజీ స్కూల్ గేమ్స్ కార్యదర్శి మల్‌రెడ్డి, కబడ్డీ సంఘం మాజీ కార్యదర్శి రామచంద్ర, పీడీలు వెంకటేష్, రాజేంద్ర, అజయ్, కిషోర్, సురేష్, అమర, శశి, ప్రసన్న, నీలవేణి, మురళి పాల్గొన్నారు.

బాలికల అండర్ -17 జిల్లా జట్టు

సి.పల్లవి(పుదిపట్ల), ఎస్.సుమ (వెరిటాస్ సైనిక్ స్కూల్), ఎం.లిఖిత, బి.పెంచల లోహిత (ఎస్పీ డబ్ల్యూ జూనియర్ కళాశాల తిరుపతి), బికె.సాయి జాహ్నవి(వి.కోట), ఎస్.సోఫియా అంజుమ్(సదుం), వి.హేమావతి (చౌడేపల్లె), జి.హేమశ్రీ(పీలేరు), బిఆర్ షాలిని(విజయవాణి స్కూల్, చౌడేపల్లె), హెచ్‌ఆర్.భవ్యశ్రీ(మునినారాయణ కాలేజ్), ఏ.కౌసల్య(కొలమాసనపల్లె), ఎంపికయ్యారు. వీరితోపాటు స్టాండ్‌బైలో జి.అనిత, వి.డోలశ్రీ, బి.నందిని, కె.రమ్య.

బాలుర జిల్లా జట్టు

ఎస్.సందీప్(చంద్రగిరి), జె.తిరుమలేష్ యాదవ్ (రామాపురం), జి.మహేంద్ర నాయుడు(సదుం), ఏ.మనోజ్ (తిరుపతి), కె. నిరంజన్(కొలమాసనపల్లె), ఎస్‌ఎస్.జాన్ పీటర్ (పుత్తూరు), జి.చరణ్(పలమనేరు), ఎం.సంజయ్ (నగరి), పి.దర్శన్(దొడ్డిపల్లె), కె. శివకేశవ (చౌడేపల్లె) పాల్గొంటారు. వీరితోపాటు స్టాండ్‌బైలో సుజిత్‌కుమార్, జోయల్, కిరణ్‌కుమార్‌రెడ్డి, గణేష్, తిరుమల.